# పోలింగ్ కేంద్రాలకు తరలిన సిబ్బంది

## నేటి ఉదయం 7 గంటల నుంచి పోలింగ్

## రూట్‌ల వారీగా సిబ్బంది తరలింపు

లక్ష్మీదేవిపల్లి, నవంబర్ 29 : సార్వత్రిక ఎన్నికల సమయం ఆసన్నమైంది.. గురువారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ జరగనుంది.. పోలింగ్ నిర్వహణ సజావుగా, సక్రమంగా జరిగేలా అధికారులు ముందస్తు కసరత్తును పూర్తి చేశారు.. ఆ సమయం రానే వచ్చేసింది. దీంతో బుధవారం తెల్లవారుజామున ఆరు గంటల నుంచే పంపిణీ కేంద్రాలకు చేరుకొని రూట్‌లు, బూత్‌ల వారీగా ఎన్నికల సామగ్రి అన్నింటినీ పంపిణీ చేశారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్నిరకాల సామగ్రి వచ్చిందా లేదా అని ఒకటికి రెండుసార్లు చెక్ చేసుకొని మరీ సిబ్బంది మొత్తం సరిచేసుకొని తమ సామగ్రితో తమకు కేటాయించిన బస్సుల్లో ఎక్కి కూర్చొని వెళ్లారు. ఈ ప్రక్రియ అంతా మండల కేంద్రంలోని శ్రీ రామచంద్ర ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఎన్నికల అధికారులు ఈవీఎంల పంపిణీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది ఉదయం ఆరు గంటలకే కళాశాలకు చేరుకున్నారు. ఎన్నికల అధికారుల నియమ, నిబంధనలకు లోబడి ఈవీఎంలు, వీవీప్యాట్‌లను ఎన్నికల విధులు నిర్వహించే వారికి రూట్‌ల వారీగా, బూత్‌ల వారీగా అందించారు. కొత్తగూడెం నియోజకవర్గంలో బీయూ యూనిట్స్ 665, సీయూ యూనిట్స్ 473, వీవీప్యాట్ యూనిట్స్ 359 పంపిణీ చేశారు. 253 పోలింగ్ కేంద్రాలు. 253 మంది ప్రొసీడింగ్ ఆఫీసర్స్, ఏపీవోలు 253 మంది, ఓపీవోలు 506 మంది ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నారు. రూట్‌ల వారీగా బస్సులను ఏర్పాటు చేశారు. ఆ బస్సుల్లో పోలింగ్ సిబ్బందితోపాటు ఎన్నికల నిర్వహణ అధికారులను తరలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్‌శాఖ, ఎన్నికల అధికారులు ఏర్పాట్లు చేశారు.



పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది, సామగ్రిని తరలించేదుకు ఏర్పాటు చేసిన బస్సులు




కొత్తగూడెంలో ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రం వద్ద అధికారులు




జూలూరుపాడు : పోలింగ్ కేంద్రాలకు చేరిన ఈవీఎంలు



పాల్వంచ : పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది, పోలీస్ సిబ్బంది



పాల్వంచ : గట్టాయిగూడెంలోని పోలింగ్ కేంద్రం



కొత్తగూడెం టౌన్ : పోలింగ్ కేంద్రానికి చేరుకున్న సిబ్బంది

### పోలింగ్ బూత్‌లకు చేరిన ఈవీఎంలు, సిబ్బంది

జూలూరుపాడు, నవంబర్ 29 : మండలంలో గురువారం జరుగనున్న సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. మండలంలోని 36 పోలింగ్ బూత్‌ల పరిధిలో 13,614 మంది పురుషులు, 14,018 మంది మహిళలు ఈ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. పోలింగ్ బూతులకు అవసరమైన ఈవీఎంలు, ఎన్నికల సామగ్రితోపాటు అధికారులు, పోలీస్ సిబ్బంది చేరుకున్నారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు సీఐ ఎం శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎస్సై పురుషోత్తం, 20మంది సీఆర్‌పీఎఫ్ పోలీసులు, 31మంది హోంగార్డులు, 25 మంది సివిల్ ఫోర్స్, 12 మంది ఫారెస్ట్ సిబ్బందిని బందోబస్తు కోసం విధులు నిర్వర్తిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐ మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా 144 సెక్షన్, 30 పోలీస్‌యాక్ట్ అమల్లో ఉన్నందున నలుగురికి మించి గుమికూడితే చర్యలు తప్పవన్నారు. అల్లరిమూకలు అల్లర్లు సృష్టిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రజలు సహకరించాలని కోరారు. ఓటర్లు ప్రలోభాలకు గురికాకుండా ఓటుహక్కు వినియోగించుకోవాలని సూచించారు.

జూలూరుపాడు మండలంలోని 36 పోలింగ్ బూతులకు ఈవీఎం యంత్రాలతో పాటు పోలింగ్ విధులు నిర్వర్తించనున్న సిబ్బంది బుధవారం కేంద్రాలకు చేరుకున్నారు. మండలంలోని ముగ్గురు సెక్టోరియల్ అధికారులు యంత్రాలతోపాటు సిబ్బందిని పోలింగ్ కేంద్రాలకు చేర్చారు. మండలంలో 36 మంది అధికారులతోపాటు అదనంగా ఒక్కో కేంద్రానికి నలుగురు చొప్పున మొత్తం 128మంది సిబ్బందిని నియమించినట్లు తెలిపారు.

### పోలింగ్ కేంద్రాలకు చేరిన సిబ్బంది

పాల్వంచ, నవంబర్ 29 : పాల్వంచ పట్టణం, మండలంలోని పోలింగ్ సిబ్బంది బుధవారం రాత్రి వరకు కేంద్రాలకు చేరుకున్నారు. మొత్తం 90 పోలింగ్ బూత్‌ల్లో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహణకు అధికారులు రంగం సిద్ధం చేశారు. 90 బూత్‌ల్లో 42,865 మంది పురుషులు, 45,587 మంది మహిళలు ఓటర్లుగా ఉండగా, ఒక ట్రాన్స్‌జెండర్ ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. ఇందుకోసం అధికారులు ఆయా పోలింగ్ బూత్‌ల్లో ఏర్పాట్లు చేశారు. కలెక్టర్ ఆదేశానుసారం ఆయా పోలింగ్ బూత్‌లన్నీ దాదాపు ప్రభుత్వ పాఠశాలల్లోనే ఏర్పాటు చేశారు. ఎన్నికల నిర్వహణకు వచ్చిన సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. తాగునీటితోపాటు సిబ్బందికి టాయిలెట్స్, బాత్‌రూమ్‌లు అన్నింటిని శుభ్రపర్చి వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రెవెన్యూ అధికారులు దగ్గరుండి పనులు చేయించారు.

### సుజాతనగర్ మండలంలో..

కొత్తగూడెం టౌన్, నవంబర్ 29 : జిల్లాలోని సుజాతనగర్ మండలంలో పోలింగ్ ప్రక్రియకు సర్వం సిద్ధం చేశారు. గురువారం ఉదయం 7గంటల నుంచి పోలింగ్ జరగనుంది. మండల వ్యాప్తంగా మొత్తం 21,829 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 10,812 మంది, మహిళలు 11,017 మంది ఉన్నారు. మండలవ్యాప్తంగా మొత్తం 24 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. 96 మంది సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద పోలీస్ సిబ్బంది కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు. రాత్రికి సిబ్బంది అక్కడే బస చేసి ఉదయాన్నే పోలింగ్‌కు కావాల్సిన ఏర్పాట్లు చేసుకొని ఎన్నికలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోనున్నారు.



సమావేశానికి హాజరైన అధికారులు, సిబ్బంది

## భారీ బందోబస్తు మధ్య పోలింగ్

### అధికారులకు దిశానిర్దేశం చేసిన ఎస్పీ వినీత్

కొత్తగూడెం క్రైం, నవంబర్ 29 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ఎస్పీ డాక్టర్ వినీత్ గంగన్న పోలింగ్ కేంద్రాల వద్ద బుధవారం భారీ బందోబస్తు ఏర్పాట్లను పూర్తిచేశారు. కొత్తగూడెం నియోజకవర్గంలో మొత్తం 253 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 956 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో సాధారణ ప్రాంతాల్లో 422 లోకేషన్స్‌లో 724 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. క్రిటికల్ ప్రాంతాల్లో 12లోకేషన్స్‌లో 15 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. అదేవిధంగా ఏజెన్సీ ప్రాంతాల్లో లెఫ్ట్ వింగ్ ఎఫెక్టెడ్(ఎల్‌డబ్ల్యూఈ) ప్రాంతాల్లో 172 లోకేషన్స్‌లో 226పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఈ పోలింగ్ కేంద్రాల్లోని ప్రతి ప్రాంతంలో భారీ బందోబస్తు ఏర్పాట్లు జరిగాయి. మొత్తం 1500 పోలీస్ బలగాలు, సీఏఎఫ్ బలగాలకు చెందిన 22 కంపెనీలు, టీఎస్ఎస్‌పీకి చెందిన 20 సెక్షన్లు, ఇతర డిపార్ట్‌మెంట్ల నుంచి 957 మందిని బందోబస్తు విధులకు కేటాయించడం జరిగింది. వీళ్లందరికీ ఎస్పీ గంగన్న గురువారం లక్ష్మీదేవిపల్లిలో ఏర్పాటు చేసిన సమీక్షలో ఎన్నికల విధుల గురించి, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి దిశానిర్దేశం చేశారు.

## రూ. 7.70 లక్షల నగదు స్వాధీనం

పాల్వంచ రూరల్, నవంబర్ 29 : మండలంలోని నాగారంలో ఒక వ్యక్తి వద్ద నుంచి పోలీసులు రూ.7.70 లక్షలను బుధవారం స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు అనుమానితుల గృహాల్లో సోదాలు చేసే కార్యక్రమంలో భాగంగా వీశంశెట్టి శ్రీనివాసరావు ఇంట్లో కూడా సోదాలు జరిపారు. ఆయన ఇంట్లో రూ.ఏడు లక్షల డెబ్బై వేలు బయటపడ్డాయి. వాటికి సంబంధించి ఎటువంటి ఆధారాలు చూపకపోవడంతో పోలీసుల నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds
WANTED
jobs Apply Now!
★ రామకృష్ణ గ్రూప్ (AP, న్యూఢిల్లీ No.1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషెంట్ల సేవకు ఇంటి/వంట పని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు 12/24 గంటల డ్యూటీ కొరకు కావలెను. ఏజెంట్లకు 5 వేలు కమీషన్. వృద్ధుల/పేషెంట్ల సేవకు వర్కర్లను 24x7 మీ ఇంటికి పంపగలము. 9281452762, 9515108830.
NT-314461

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616